క్లుప్తంగా

'ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలి'

మరికల్: నారాయణపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చిన డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరన్న, పట్టణ అధ్యక్షుడు హరీశ్ కోరారు. మండల కేంద్రంలో శనివారం వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం పట్టుదలతో కృషి చేసిన శివకుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి వస్తే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని.. విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో గోపాల్, రామకృష్ణ, సత్యన్న, గోవర్ధన్, రఘు, ఆంజనేయులు, చెన్నయ్య, రామకృష్ణారెడ్డి ఉన్నారు.

జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు పయనం



మాగనూర్: హైదరాబాద్‌లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీల్లో మాగనూర్‌కు చెందిన విద్యార్థులు శ్రావణి, అఖిల ప్రతిభకనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం నుంచి నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్రీడలకు విద్యార్థులు బయల్దేరి వెళ్లినట్లు విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తుల్జా భవాని ఉత్సవాలు



కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి తండాలో శనివారం తుల్జా భవాని మాత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తమ ఇంటి దేవుళ్లు అయిన కన్నయ్య, బాలాజీ, బావాజీలకు తీపీ వంటకాలతో నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించుకోనున్నట్లు తండావాసులు తెలిపారు. మంగళవారం ధాన్యం సంచుల నడుమ తుల్జా భవాని మాత విగ్రహాన్ని ఉంచి మేకపోతులు, పొట్టేళ్లతో మొక్కులు తీర్చుకుంటారు. బుధవారం తమ కుటుంబాల్లో దివంగతులైన పెద్దలకు సంప్రదాయ బద్ధంగా మొక్కులు తీర్చుకుంటామని తండావాసులు తెలిపారు.

ఓటుహక్కు వజ్రాయుధం



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని హంసవాహిని ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నామినేషన్ నుంచి ప్రచారం, ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు వరకు చేపట్టే ప్రక్రియపై విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. దేశ భవిష్యత్‌ను మార్చేందుకు ప్రతి వయోజనుడు తన ఓటుహక్కును వజ్రాయుధంలా వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ రాజేష్ కుమార్ కోరారు. అనంతరం నోటా ఏర్పాటు, చాలెంజ్ ఓటు, అభ్యర్థికి పార్టీలు ఇచ్చే బీ ఫాం, రిగ్గింగ్ తదితర విషయాలను వివరించారు. అదే విధంగా ఓటును డబ్బులు, మద్యానికి అమ్ముకోరాదని సూచించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ రైతుల ధర్నా



ఊట్కూరు: నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న దంతన్‌పల్లి గ్రామ రైతులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ భూములనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతులకు ఎత్తిపోతల పథకం పేరుతో అన్యాయం చేయొద్దన్నారు. ఎత్తిపోతల పథకం నిర్మాణంపై రైతులకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు భూములు కోల్పోతున్న రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు సురేందర్‌రెడ్డి, భరత్, తరుణ్‌రెడ్డి, ఆనంద్, అనీల్, రాఘవేందర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారులు





చేగుంట రైల్వేస్టేషన్ నుంచి ఐనాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు ఇలా..

- సరిహద్దు గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు అవస్థలు
- బీటీరోడ్ల నిర్మాణంపై దృష్టిసారించని ప్రభుత్వం

కృష్ణా: రాష్ట్ర సరిహద్దు గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే అవస్థలు తప్పడం లేదు. గుంతలమయంగా మారిన రహదారులపై రాకపోకలు సాగించలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కృష్ణా మండలంలోని చేగుంట రైల్వేస్టేషన్ నుంచి ఐనాపూర్ లింక్ రోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారితో పాటు సుకూర్ లింగంపల్లి, కుసుమర్తి గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్లకు కనీసంగా మరమ్మతు చేయించకపోవడంతో రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఆయా గ్రామాల ప్రజలకు కొన్నేళ్లుగా సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

● మరోవైపు కృష్ణా మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న బాడియాల్ గ్రామానికి ఐనాపూర్ గ్రామం నుంచి ఉన్న రోడ్డుతో పాటు చేగుంట – బాడియాల్ రోడ్డు, సూకూర్ లింగంపల్లి – గూడూర్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటు తెలంగాణ ప్రాంత ప్రజాప్రతినిధులు, అటు కర్ణాటక ప్రాంత ప్రజాప్రతినిధులు రోడ్ల సమస్య పరిష్కారంపై దృష్టి సారించడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కొన్ని గ్రామాలకు కర్ణాటక ప్రభుత్వం రాష్ట్ర సరిహద్దు వరకు బీటీరోడ్లు నిర్మించగా.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలకు రోడ్డు సౌకర్యం మెరుగుపర్చాలని కోరుతున్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డును బాగుచేయాలి..



చేగుంట గ్రామ రైల్వేస్టేషన్ మట్టిరోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. కనీసం పాదచారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో ఈ రోడ్డుపై వాహనాలు వెళ్లలేక ప్రాణాలు పోతున్నాయి. కిలోమీటర్ దూరం ఉన్న రోడ్డుకు మరమ్మతు చేయించాలి.

– గంటి శరణు బసవ, ఐనాపూర్

బీటీరోడ్లు నిర్మించాలి..



కర్ణాటకలోని బాడియాల్ గ్రామానికి వెళ్లే దారిని బీటీరోడ్డుగా మార్చాలి. అక్కడి కర్ణాటక ప్రభుత్వం వారి సరిహద్దు వరకు బీటీరోడ్డుగా గతేడాది నిర్మించింది. మన ప్రభుత్వం మాత్రం మిగతా రోడ్డును పూర్తి చేయడంలేదు. అలాగే గ్రామపంచాయతీకి అనుబంధ గ్రామమైన సూకూర్, లింగంపల్లి గ్రామానికి ఉన్న మట్టి రోడ్డు కూడా దెబ్బతింది. ఈ రోడ్డును బీటీరోడ్డుగా మారిస్తే ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తీరుతాయి.

– అంజనమ్మ పాటిల్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు

బీజేపీని మరింత బలోపేతం చేద్దాం



మక్తల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

ఊట్కూరు/మక్తల్: క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఊట్కూరులో శనివారం సత్యయాదవ్‌కు మండల నాయకులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, మాజీ వార్డు సభ్యులు శ్రీకాంత్, రణవీర్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికై మొదటిసారిగా మక్తల్‌కు వచ్చిన సత్యయాదవ్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, ఓబీసీ సెల్ అధికార ప్రతినిధి శంకరోళ్ల రవికుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు లక్ష్మణ, కల్లూరి నాగప్ప, రవికుమార్, జయనంద్‌రెడ్డి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



మాట్లాడుతున్న వెంకట్రామారెడ్డి

దామరగిద్ద: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ శనివారం సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపించిందన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు బడ్జెట్‌లో మాత్రం తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. దేశంలో 70 శాతానికి పైగా ఉన్న రైతులకు ఎరువులు, పంటల మద్దతు ధరలపై బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. ఇది పేదల బడ్జెట్ కాదని.. కార్పొరేటర్ల బడ్జెట్ అని అన్నారు. ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్, జోషి, శివకుమార్, నర్సింహ, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

కోస్గి బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించండి



ఆర్టీసీ ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కోస్గి రూరల్: నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే కోస్గి బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాలెం ప్రశాంత్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బాలకృష్ణగౌడ్, జైపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌చార్జి వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్, తాండూర్, పరిగి, నారాయణపేట ప్రాంతాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి బస్సులు కోస్గి బస్టాండ్ మీదుగా రాకపోకలు సాగిస్తాయని.. బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పోకల లక్ష్మణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

దామరగిద్ద: పదో తరగతి విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెచ్‌ఎం ఆశమ్మ కోరారు. శనివారం మండలంలోని విఠలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మంచి వాతావరణంలో చదువుకునేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులను ఉన్నతంగా చదివించి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్/మాగనూర్: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలం గుర్లపల్లి గ్రామానికి చెందిన శంకరమ్మ వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 1.70లక్షల ఎల్‌ఓసీని శనివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యం, ఇతర కారణాలతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే పేదలను ప్రభుత్వం సీఎం సహాయనిధితో అన్నివిధాలా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, ఆనంద్‌గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, నారాయణ, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

● మాగనూర్ మండల తాజా మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య ఆకస్మిక మరణం బాధాకరమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటయ్య శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న వారు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వెంకటయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులకు తోడ్పాటు అందించాలి



సజనాపూర్‌లో విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దామరగిద్ద: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు తోడ్పాటు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోపాల్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రఘుపాల్ అన్నారు. ఇలెన్‌సిస్ కార్పొరేషన్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ బృందం వితరణ చేసిన స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిల్స్, నోట్ పుస్తకాలను శనివారం మండలంలోని సజనాపూర్, ఉడ్మల్‌గిద్ద పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులకు ప్రైవేటు సంస్థ అవసరమైన వస్తువులను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్‌ను మనోహర్, సీఎస్ఆర్ కమిటీ సభ్యులు దీక్షిత, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు ఘననివాళి



జిల్లా కేంద్రంలో అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట/మక్తల్/కోస్గి: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో శనివారం మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోనిపాటి కళ్యాణ్ మాదిగ మాట్లాడుతూ.. జననేత మందకృష్ణ మాదిగ చేపట్టిన 30 ఏళ్ల సుదీర్ఘ పోరులో అమరులైన వీరులకు వర్గీకరణను అంకితం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ జనాభా తామాషా ప్రకారం ఎవరి వాటా వారికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు రవికుమార్, హన్మంతు, చల్లా వెంకటేష్ , తిరుమలేష్, రమేష్, రాములు, అశోక్, రాజు, రంగప్ప పాల్గొన్నారు.

● మక్తల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగేశ్, నారాయణ, కృష్ణ, తేజ, జ్ఞానప్రకాస పృథ్వీరాజ్, నరేష్, రవికుమార్, అంజి, బాలకృష్ణయ్య, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

● కోస్గి మున్సిపాలిటీ, గుండుమాల్ మండల కేంద్రంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ మౌర్య, తాలూకా అధ్యక్షుడు రాములు, రమేష్ బాబు, కొత్తపల్లి కనకప్ప, అంజియాదవ్, పిరంగి వెంకట్, చిన్నికృష్ణ, రామకృష్ణ, బాలు, శ్రీను, భరత్ పాల్గొన్నారు.

గోవుల తరలింపు అడ్డగింత

ఆత్మకూర్: గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని యువకులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ నరేందర్ వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి మండలంలోని పిన్నంచర్ల వైపు బొలేరో వాహనం అతివేగంగా రావడంతో గ్రామ యువకులు అశోక్‌నంద, నీలారెడ్డి, అశోక్, కళ్యాణ్, శివ అడ్డుకుని తనిఖీ చేశారు. వాహనంలో తొమ్మిది గోవులు ఉండటంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఫయాజ్, హమీద్ అక్రమంగా ఆవులను తరలిస్తున్నట్లు గుర్తించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆవులను పిన్నంచర్లలోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



ధన్వాడ: మండలంలోని గున్ముక్ల గ్రామం నుంచి పలువురు భక్తులు శనివారం తిరుమల తిరుపతి దేవస్థానానికి పాదయాత్ర చేపట్టారు. తమ గ్రామం పాడిపంటలు, సిరి సంపదలతో తులతూగాలని కాంక్షిస్తూ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.

ఇసుక డంప్ సీజ్



మద్దూరు: మండలంలోని నాగంపల్లి శివారులో ఉన్న వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సమీపంలోని పొలాల్లో డంపింగ్ చేశారు. శనివారం రెవెన్యూ, పోలీసు అధికారులు ఇసుక డంప్‌లను గుర్తించి సీజ్ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను ట్రాక్టర్లలో పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ మహేష్‌గౌడ్ తెలిపారు. నాలుగు ట్రాక్టర్ల ఇసుకకు త్వరలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుకను తరలించి డంప్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

నారాయణపేట ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వరి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి విద్యా నాయక్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరైనా బాలల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని.. చిన్నారుల చదువుకు తోడ్పాటు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పిల్లల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సివిల్, క్రిమినల్, లైంగిక నేరాల నుంచి రక్షణ, సమాజంలో ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే విధించే శిక్షలు, మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ వలంటీర్లు పాల్గొన్నారు.

- భక్తిశ్రద్ధలతో పరమేశ్వరస్వామి జాతర
- శివనామస్మరణతో పులకించిన ఆత్మకూర్
- స్వామివారి రథోత్సవానికి వేలాది తరలివచ్చిన భక్తజనం

హరహర మహాదేవ శంభో శంకర



ఆత్మకూర్: పట్టణంలోని చెరువు మధ్యలో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. వందలాది భక్తులు స్వామివారికి దాసంగాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారి రథోత్సవం కనులపండువగా జరిగింది. వందలాది భక్తజనం నడుమ స్వామివారు రథంపై ఊరేగారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో ఆత్మకూర్ మార్మోగింది. అంతకుముందు వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పట్టణ పురవీధుల గుండా స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఉత్సవాల్లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతర కమిటీ కన్వీనర్ వెంకట నర్సింహారావు, నిర్వాహకులు సాయిరాఘవ, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, నాగేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, రవికాంత్, పరమేశ్, తులసీరాజ్, శ్రీను, దామోదర్, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



కోస్గిలో ఉపాధ్యాయులైన విద్యార్థులు..



మక్తల్ పట్టణంలో..

మక్తల్/కోస్గి రూరల్: మక్తల్ పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠ్యాంశాలు బోధించారు. విద్యాబోధనలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు హెచ్‌ఎం చంద్రశేఖర్ బహుమతులను ప్రదానం చేశారు. అదే విధంగా కోస్గి పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విష్ణుచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మశాలి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



జిల్లా కేంద్రంలో పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్/ధన్వాడ: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 9న నిర్వహించే పద్మశాలి 8వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు కెంచె ఉదయభాను కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో, ధన్వాడ మండల కేంద్రంలో పద్మశాలి రాష్ట్ర మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చేనేత కార్మికులు ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రభుత్వం అర్హులైన చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పింఛన్లు ఇవ్వడంతో పాటు బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆడెం సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్ను ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు క్యాతన్ రఘువీర్, శ్రీను, శివాజీ, బాలరాజు, శ్రీనివాసులు, బాలప్ప, భాస్కర్, వెంకటేష్, యంగలి విఠోబ, కృతన్ తిలక్, గొరంట్ల అశోక్ పాల్గొన్నారు.